

## ఘనంగా రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం వాసవీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం గుణ్ణం వేణుగోపాల్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో 18 జిల్లాల నుంచి 226 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు చంద్రశేఖర్ తెలిపారు. ఏడు రౌండ్లలో జరిగిన ఈ పోటీలలో ఐదు విభాగాలలో మొదటి ఐదు స్థానాలలో నిలిచిన విజేతలు, విజయవాడలో జరగనున్న ఆల్ ఇండియా 1800 రేటింగ్ లోపు ఉన్న పోటీలకు నేరుగా అర్హత సాధిస్తారని నిర్వాహకులు తెలియజేశారు. ఈ 25 మంది విజేతలను నవంబరు 22వ తేదీన జరిగే పోటీలకు నేరుగా అర్హత సాధిస్తారని నిర్వాహకులు చంద్రశేఖర్ తెలియజేశారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన యువనాయకులు బొలిశెట్టి రాజేష్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అనిల్ కుమార్, పవన్, గుప్తా, ఆంధ్ర చెస్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కెవివి.శర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణికుమార్, బ్లూమ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

# కౌలు రైతులకు పరిహా(రం)సం..!

**ఆరుగాలం కష్టపడింది కౌలు రైతులు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిందీ కౌలు రైతులే. మొంథా తుపాను వల్ల జరిగిన పంట నష్టం నమోదులో భూ యజమానుల పేర్లు నమోదు చేస్తున్న పరిస్థితి నెలకొంది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంట నష్టం నమోదు చేస్తూ కౌలు రైతులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. పెట్టుబడి పెట్టిన కౌలు రైతుకు కాకుండా.. సాగుకు దూరంగా ఉన్న భూయజమానికి పంట నష్టపరిహారం అందించేందుకు సిద్ధమైంది. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు కౌలు రైతుల ఆత్మహత్యల గురించి మాట్లాడుతూ సొంత సొమ్ములు సాయం చేసిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఇప్పుడు నోరు మెదపకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట నష్టం కౌలు రైతులకు ఇవ్వాలంటూ సాగుదారులు కోరుతున్న పరిస్థితి నెలకొంది.**



ఉంగుటూరులో దెబ్బతిన్న పంటను చూపుతున్న కౌలురైతు

**వెబ్‌ల్యాండ్ ఆధారంగానే పంట నష్టం నమోదు**

**95 శాతం వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లే**

**రెండు జిల్లాల్లో తుదిదశకు పంట నష్టం లెక్కలు**

**33 వేల ఎకరాల్లో వరికి నష్టం**

**ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టిన కౌలురైతు**

**నష్టపరిహారం సాగుచేయని భూయజమానికే**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో లక్షా 95 వేల ఎకరాలు, పశ్చిమలో 2.05 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వ్యవసాయ సాగులో 80 శాతం కౌలు రైతులే చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ముగుస్తున్నా ఇప్పటికీ కౌలు కార్డుల జారీ ప్రక్రియ పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ ఆరంభం నుంచి రైతులు ఎన్నో కష్టాలకు ఓర్చి ముందుకు సాగారు. పంట చివరి దశకు చేరిన సమయంలో మొంథా తుపాను విరుచుకుపడింది. పంట పొలాలు నేల కొరిగి నీటిలో నానుతున్నాయి. ఈనిక దశలో ఉన్న పొలాలు పనికి రాకుండాపోతున్న పరిస్థితి నెలకొంది. తుపాను తీరం దాటి సాధారణ పరిస్థితికి రాగానే వ్యవసాయాధికారులు పంట నష్ట నమోదుకు దిగారు. ఆదివారం సాయంత్రానికి దాదాపు పంటనష్టం ప్రక్రియ పూర్తయిన పరిస్థితి నెలకొంది. తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు 35 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాలు దెబ్బతినగా, ఏలూరు జిల్లాలో 12,560 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు తేలింది. ఇంత వరకూ బాగానే ఉంది. పంట నష్టమోదులో వాస్తవ సాగుదారుడైన కౌలు రైతుల పేర్లు కాకుండా భూ యజమానుల పేర్లు నమోదైన పరిస్థితి నెలకొంది. పంట నష్ట నమోదులో 95 శాతం మంది భూ యజమానులే ఉన్నారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంట నష్ట నమోదు జరుగుతోంది. వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లు తప్ప కౌలురైతులను చేర్చలేదు. కౌలుకార్డులు అందుకున్నవారి పేర్లను చేర్చినట్లు అధికారులు చెబుతున్నా సాగు చేసిన రైతుల్లో ఐదు శాతం కూడా లేని పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వం ఇచ్చే పంట నష్టపరిహారం భూ యజమానుల జేబుల్లోకి వెళ్లిపోనుంది.

**సొమ్ము ఒకరిది.. సోకు వేరొకరిది..**

దెబ్బతిన్న పంటలో అత్యధిక భాగం కౌలురైతులే సాగుచేసిన పరిస్థితి నెలకొంది. ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టి నష్టపోయారు. న్యాయ ప్రకారం నష్టపోయిన కౌలురైతులకు పరిహారం అందాలి. రెండు జిల్లాల్లో పంట నష్టపోయిన రైతులు 25 వేల మందికిపైగా ఉన్నారు. ప్రభుత్వం మాత్రం నష్టపోయిన కౌలురైతులకు కాకుండా సాగుచేయని భూయజమానికి నష్టపరిహారం అందించేందుకు సిద్ధపడుతోంది. దీంతో 'సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది అన్నట్లుగా పరిస్థితి తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎకరాకు రూ.పది వేల పంట నష్టపరిహారం అందించనుంది. కౌలురైతులకు అందితే పెట్టిన పెట్టుబడిలో కొంతైనా ఊరట లభిస్తుంది. అలాకాకుండా చిల్లిగవ్వ పెట్టుబడి పెట్టని భూ యజమానులకు పరిహారం ఇవ్వడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. బ్యాంకులు సైతం భూ యజమానులకే పంట రుణాలు ఇచ్చాయి. రుణాలు ఇచ్చే సమయంలో బీమా ప్రీమియం భూయజమానుల నుంచే కట్టించుకున్నారు. బీమా పరిహారం సైతం భూయజమానులకే వెళ్లనుంది. ఏటా ఇదే విధంగా కౌలురైతులకు అన్యాయం చేస్తున్నారు. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కౌలురైతుల ఆత్మహత్యలపై మాట్లాడడంతో పాటు, మృతి చెందిన కౌలురైతుల కుటుంబాలకు సొంత సొమ్ములు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. తాము అధికారంలోకి వస్తే కౌలురైతుల చట్టంలో మార్పులు తెచ్చి ఆదుకుంటామంటూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకూ కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి. పంట నష్టపరిహారం నష్టపోయిన కౌలురైతులకే ఇవ్వాలంటూ సాగుదారులు కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది.

# 1100 సేవలను వినియోగించుకోండి

**నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ - కలెక్టర్ చదలవాడ నాగరాణి**

ప్రజాశక్తి - భీమవరం



ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈనెల మూడో తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించు కోవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

# ప్రభుత్వ భూముల్లో కొబ్బరి చెట్లు పేదలకు ఇవ్వాలి

**వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు**

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ భూముల్లో కొబ్బరి చెట్లు పేదలకు ఇవ్వాలని, ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం భీమవరం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బాతి రెడ్డి జార్జి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు లక్షల కొబ్బరి చెట్లు ఉన్నాయని, ఇవన్నీ భూస్వాముల చేతుల్లో 99 సంవత్సరాల లీజులో ఉన్నాయని తెలిపారు. పేదల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూమిని దూరం చేయడానికి ఫ్రీహోల్డ్ చట్ట సవరణ కార్యక్రమాన్ని చంద్రబాబు తీసుకొస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కొబ్బరి చెట్లు పేదలకు ఇవ్వాలని, జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మారుస్తానని చెబుతున్న చంద్రబాబు కేరళలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఫార్ములా అమలు చేస్తే ధైర్యం కూటమి ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నవంబర్ 10, 11వ తేదీల్లో జిల్లా 32వ మహాసభలు అత్తిలిలో షాది ఖానా కమ్యూనిటీ భవనంలో జరుగుతున్నాయని, ఈ మహాసభలో గత మూడేళ్లలో ఉద్యమ పోరాటాలు చర్చించి రానున్న మూడేళ్లల్లో కర్తవ్యాలను రూపొందించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరవుతారని, మహాసభల జయప్రదానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, కండెల్లి సోమరాజు, సహాయ కార్యదర్శులు బళ్ల చిన వీరభద్రరావు, శేషపు అశ్రియ్య, యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

# కల్తీ మద్యం ఏరులు

**కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి**

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని, ప్రభుత్వం చోద్యం చూస్తూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. ఆదివారం స్థానిక అమరవీరుల భవనంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ రోజుకు ఒక్కో బ్యాటరీ నుండి కల్తీ మద్యం 30 వేల లీటర్లు తయారవుతోందని, దాన్ని రాష్ట్రంలో విచ్చలవిడిగా అమ్ముతున్నారని అన్నారు. సిబిఐ ఎంక్వయిరీ వేసి దోషులను పిడి యాక్టు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసిపి తణుకు పట్టణ అధ్యక్షులు మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ వైఎస్ఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ ఆధ్వర్యంలో చట్టబద్ధంగా మద్యాన్ని విక్రయించే వారన్నారు. నేడు ప్రజా ప్రతినిధులే బెల్ట్ షాపుల నిర్వహణకు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. గీత కార్మికులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా, ఆదరణ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ కల్లు గీత సాంప్రదాయమైన వృత్తి అన్నారు. గతంలో పథకాలన్నీ వారికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు వెలగల సాయిబాబారెడ్డి మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ద్వారా మద్యాన్ని విక్రయిస్తున్నారని, గతంలో ఈ విధంగా ఉండేది కాదని అన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం నిర్వహించే పోరాటాలకు వైసిపి పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ మాట్లాడుతూ గీత కార్మిక వృత్తికి ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉండడం వల్ల మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బెల్ట్ షాపులను రద్దు చేసే వరకూ మహిళా సంఘం ఆధ్వర్యంలో పోరాటాలను విస్తృతం చేశామని తెలిపారు. సామాజిక పోరాట సమితి వ్యవస్థాపకులు మురళీ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్య పోరాటాలే శరణ్యమని, వాటిని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికుల నిర్వహించే అన్ని పోరాటాలకు అఖిలపక్షం నాయకులు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో గీత కార్మిక నాయకులు కడలి పాండు, మామిడిశెట్టి నాగభూషణం, గార రంగారావు, దాసరి సూరిబాబు, కడలి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

# బాబూరావు మృతి తీరని లోటు

**సంతాప సభల్లో నేతలు**

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చింతకాయల బాబూరావు మృతి కార్మికులకు, ప్రజలకు, సిపిఎం పార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం భీమవరం మండలం రూరల్ తోకతిప్ప గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు బాబూరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టులు ప్రజల కోసమే పనిచేస్తారని, బాబూరావు కార్మికులు, ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. ఆయన చనిపోయిన తర్వాత కూడా ఈ సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుగానే మెడికల్ కాలేజీకి తన భౌతిక దేహాన్ని అప్పగించాలని చెప్పడం అది కమ్యూనిస్టులకే సాధ్యమన్నారు. ఆయన లేకపోవడం కార్మిక వర్గానికి, ప్రజలకు, సిపిఎంకి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు బొడ్డు లక్ష్మీపతి, తోటే శుభకరరావు, తిరుమణి హనుమంతు, మారాడి కోటేశ్వరరావు, మోక పెంటయ్య ఉన్నారు.

**వీరవాసరం :** కార్మికోద్యమ నేత, ప్రజా నాయకుడు చింతకాయల బాబూరావుకు సిఐటియు వీరవాసరం మండల కమిటీ జోహార్లు అర్పించింది. ఆదివారం వీరవాసరంలో బాబూరావు చిత్రపటం ముందు పుష్ప గుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పి.నాగరత్నం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఒక సాధారణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించి ప్రజా ఉద్యమ నాయకునిగా బాబూరావు ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ సంఘాల నాయకులు సత్యవతి, నిర్మల, భవాని, నాగ పార్వతి పాల్గొన్నారు.



భీమవరం టౌన్‌లో..

**గణపవరం :** సిఐటియు నాయకులు చింతకాయల బాబూరావుకి ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా నాయకులు కాటుక ఝాన్సీ లక్ష్మి, మండల కార్యదర్శి ఎం.పెంటారావు మాట్లాడుతూ బాబూరావు గణపవరంలో రైసుమిల్లు కార్మికుడుగా పనిచేస్తూ సిఐటియు జిల్లా నాయకుడుగా ఎదిగిన వ్యక్తి అన్నారు. సిఐటియు నాయకులు కె.త్రినాధ్, బి.వెంకటలక్ష్మి, ఎన్.చంద్రకళ పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** కార్మిక లోకానికి, సిఐటియుకు, సిపిఎంకి చింతకాయల బాబూరావు చేసిన సేవలు అపారమని పలువురు కార్మిక నాయకులు నివాళులు తెలిపారు. ఆదివారం మండలంలోని బ్రాహ్మణ చెరువు వద్ద ఉన్న సివిల్ సప్లై గోదాముల ప్రాంగణంలో ఇటీవల మరణించిన సిఐటియు నేత చింతకాయల బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గంటి ఆంజనేయులు, కుడుపూడి శ్రీరామచంద్ర, బొంతు నాగేశ్వరరావు, మల్లుల శ్రీను, బొంతు వెంకన్న పాల్గొన్నారు.

**పోడూరు :** సిపిఎం నేత బాబూరావు మృతి పట్ల జిన్నూరు గ్రామ శాఖ సంతాపం తెలిపింది. ఆదివారం నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో పార్టీ నేతలు కొప్పర్తి నరసింహమూర్తి, తాళాబత్తుల గాంధీ, వెల్దుటి నాగేశ్వరరావు, కేతలి వెంకటేశ్వర్లు, గుబ్బల గంగాచలం, చివటపు ఆంజనేయులు, తదితరులు బాబూరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# తూతూమంత్రంగా సివిల్ రైట్స్ డే

**దళితులతో దళిత పేటలో నిర్వహించడం చట్టవిరుద్ధం**

**జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి**

**కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు**

ప్రజాశక్తి - భీమవరం

సివిల్ రైట్స్ డేను తూతూమంత్రంగా నిర్వహించడం తగదని, దీనిపై జిల్లా కలెక్టర్ తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం జిఒ 105 ప్రకారం ప్రతినెలా చివరి రోజున మండలంలో ఒక గ్రామంలో అన్ని కులాల వారితో సివిల్ రైట్స్ డే జరపాలని తెలిపారు. ఆ సమావేశంలో తహశీల్దార్, మండల ఎస్ఐలు ప్రధాన పాత్ర పోషిస్తూ స్థానిక అన్ని కులాల పెద్దలను, ప్రజలను, సామాజిక సంఘాలను భాగస్వామ్యం చేయాలని గుర్తుచేశారు. జిల్లాలో అనేక మండలాల్లో ఈ సివిల్ రైట్స్ సమావేశాలు తూతూ మంత్రంగా జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి తహశీల్దార్, ఎస్ఐలు గైర్హాజరై ఆర్ఐ, కానిస్టేబుల్ వంటి వారిని పంపించి చేతులు దులుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రామ నడిబొడ్డున, గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే జరపకుండా దళిత పేటలో నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని సామాజిక తరగతులను కాకుండా దళితులను మాత్రమే పిలవడం సరికాదన్నారు. చట్టాన్ని చట్టవిరుద్ధంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. సివిల్ రైట్స్ డే సమావేశాలపై విచారణ జరిపి తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్, జిల్లా సహాయ కార్యదర్శులు చిన్నం చిన్న నాగేశ్వరరావు, మాదాసి గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు

# వర్షం వస్తే తడవాల్సిందే..!

- స్లాబ్ నుంచి కారుతున్న వర్షపు నీరు
- పెరగని మెనూ ఛార్జీలు

ప్రజాశక్తి పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల


ఒకప్పుడు ఎంతో పేరు ప్రఖ్యాతలుండి మండలంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులతో కళకళలాడుతూ ఉండే కాళ్ల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో నేడు విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఒకప్పుడు బాలికల హాస్టల్‌గా ఉండగా నేడు బాలుర హాస్టల్‌గా నడుపుతున్నారు. హాస్టల్‌లో అన్ని వసతులున్నా విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. విశాలమైన భవనంలో చదువుతో పాటు ఆటలాడుకోవడానికి చాలా అనువుగా ఉంది. కానీ వర్షం వచ్చినప్పుడు హాస్టల్ భవనం స్లాబ్ నుంచి వర్షపు నీరు కారుతుంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

హాస్టల్‌లో మొత్తం 32 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్ పరిస్థితులను పరిశీలిస్తున్నప్పుడు 22 మంది విద్యార్థులున్నారు. భీమవరం, కలిదిండి, జక్కరం, కోమటిలంక, గుమ్ములూరు, చిన కాపవరం, రాయకుదురు ప్రాంతాల నుంచి వచ్చి హాస్టల్‌లో ఉంటూ 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. హాస్టల్‌లో ట్యూటర్ లేరు.

బిసి బాలికల సమీకృత హాస్టల్ భవనంలో విశాలమైన 10 గదులున్నాయి. కిటికీలు, తలుపులు సక్రమంగా ఉన్నాయి. మరుగుదొడ్లు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నాయి. ఉదయం స్కూల్‌కు వెళ్లే ముందు స్నానానికి ఇబ్బంది లేదు. హాస్టల్‌కు నీటి సదుపాయం ఉంది. రాత్రి వేళలో పడుకోవడానికి బెడ్స్ ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో ఎంఎల్ఎ రఘురామకృష్ణ రాజు ఆర్థిక సాయంతో 32 బెడ్స్ అందించారు. చలికాలం రీత్యా దుప్పట్లు, నోట్ బుక్స్, విద్యా సామగ్రి అందించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగానే ఉన్నాయి. డైనింగ్ రూమ్, కిచెన్‌ల పరిస్థితితోపాటు నిర్వహణ, మెనూ అమలవుతుంది. హాస్టల్ విద్యార్థులకు సెప్టెంబర్ 22న మెడికల్ అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, రొంప, జలుబు వస్తున్నాయి. సంక్షేమ హాస్టల్ శిథిలావస్థకు చేరి స్లాబ్ నుంచి వర్షపు నీరు పలు చోట్ల వస్తుంది. ఇన్‌ఛార్జి వార్డెన్, ఇద్దరు సిబ్బందిలో ఒకరు కామాటి, ఇంకొకరు నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. వార్డెన్ భీమవరం నుంచి ప్రతి రోజు ఉదయం పూట అందుబాటులో ఉంటున్నారు.

**పెరగని మెనూ ఛార్జీలు**

పెరుగుతున్న ధరలు.. పెరగని ఛార్జీలు, పెరిగిన ధరలతో పోల్చితే హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారింది. పిల్లలకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. మూడు, నాలుగో తరగతి విద్యార్థుల కోసం రోజుకి రూ.38, ఐదు, పదో తరగతి చదువుకునే వారికి రోజుకి రూ.47 మాత్రమే ఇస్తున్నారు. రోజూ ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం కలిపి ఒక్కొక్కరికీ ప్రభుత్వం ఈ మొత్తం మాత్రమే అందజేస్తోంది. బయట మార్కెట్‌లో భోజనం చేయాలంటే రూ.100 తక్కువ లేదు. టిఫిన్ తినాలన్నా రూ.30 నుంచి 40 ఖర్చు అవుతోంది. ఈ పరిస్థితుల్లో రూ.38 నుంచి రూ.53 ఇస్తున్నందున ఏ మేరకు మెనూ ఛార్జీలను అమలు చేయాలనేది ప్రశ్నార్థకంగా మారింది. కూరగాయల ధరల నుంచి మొదలుకొని పప్పులు, ఆయిల్, గ్యాస్ ఇలా అన్ని రకాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పుడు ఇస్తున్న మెనూ ఛార్జీలతో ఏ విధంగా పౌష్టికాహారం వండి పెట్టాలనేది వార్డెన్‌లకు తలనొప్పిగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సంక్షేమ వసతి గృహాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



స్లాబ్ నుంచి కారుతున్న వర్షం నీరు

**స్లాబ్ మరమ్మతులకు నిధులు మంజూరు**

**పి.సురేష్ బాబు, ఇన్‌ఛార్జి హాస్టల్ వార్డెన్, కాళ్ల**

ప్రస్తుతం వసతి గృహంలో 32 మంది విద్యార్థులు ఉన్నారు. స్లాబ్ మరమ్మత్తులు, వివిధ పనులను చేసేందుకు రూ.10.50 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. వర్షాకాలం పూర్తి అయిన తరువాత మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంది.

# జిల్లాలో 612 బెల్టు షాపులపై కేసులు

- 1,078 లీటర్ల మద్యం 11 లీటర్ల బీరు స్వాధీనం
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగిస్తే చర్యలు
- జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ప్రభుకుమార్
- ప్రజాశక్తి వార్తకు స్పందించిన ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ప్రభుకుమార్ హెచ్చరించారు. మద్యం ఏరులు అనే శీర్షికతో ఆదివారం ప్రత్యేక కథనాన్ని ప్రజాశక్తి పత్రికలో ప్రచురించడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ప్రభు కుమార్ స్పందించారు. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 612 మంది బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని స్పష్టం చేశారు. వారి నుంచి 1078.89 లీటర్ల మద్యం, 11.05 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే 436 మంది బెల్ట్ షాపు నిర్వాహకులను బిఎన్ఎస్ఎస్ చట్ట ప్రకారం బైండోవర్ చేయడం జరిగిందన్నారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిపై 121 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 193 మద్యం దుకాణాలకు అధికారికంగా పెర్మిట్ రూమ్ లైసెన్స్‌లు జారీ చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## రేపటి నుంచి బీచ్‌లో పర్యాటకులకు అనుమతి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లలో ఆదివారం ఆర్‌డిఒ దాసిరాజు పర్యటించారు. సముద్రంలో కెరటాల ఉధృతి, పర్యాటకులను అనుమతించకుండా చేసిన ఏర్పాట్లపై ఆరా తీశారు. మంగళవారం నుండి పర్యాటకులను యథావిధిగా సందర్శనకు అనుమతి ఇచ్చేట్టు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజు కిషోర్, విఆర్‌ఒ ముచ్చర్ల నిరంజన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

### బీచ్‌లో బందోబస్తు

మండలంలోని కేపీ పాలెం సౌత్, పేరుపాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ప్రాంతానికి ఆదివారం పర్యాటకులను అనుమతించలేదు. తుపాన్ ప్రభావంతో సముద్రం అలలు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఎస్ఐ జి.వాసు పర్యవేక్షణలో సిబ్బంది బీచ్‌కు పర్యాటకులను అనుమతించకుండా బందోబస్తు నిర్వహించారు.

## చేనేత కార్మికులను ఆదుకోవాలి

### అల్లాడ సూర్య భాస్కరరావు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మొంథా తుపాన్ వల్ల ప్రభావిత ప్రాంతాల్లో తీవ్రంగా నష్టపోయిన చేనేత మగ్గం కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని దేవాంగ అభ్యుదయ సేవాసంఘం రాజకీయ విభాగం కన్వీనర్ అల్లాడ సూర్య భాస్కరరావు కోరారు. ఆదివారం మార్టేరులో ఆయన మాట్లాడుతూ తుపాన్ వల్ల రైతులు నష్టపోయినట్టే చేనేత కార్మికులకు కూడా తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. చేనేత కార్మికుల మగ్గం ఉన్న గుంతల్లో నీళ్లు చేరడంతో పాటు మగ్గం సామగ్రి నీటిలో తడిసి, పనికి రాకుండా పోయినట్లు ఆయన పేర్కొన్నారు. చేనేత కార్మికులు తిరిగి మగ్గం సామాగ్రి చేకూర్చుకొని, మగ్గాన్ని సరిచేసుకుని సరికి కొన్ని నెలల సమయం పడుతుందని వాపోయారు. కూటమి ప్రభుత్వం తుఫాను వల్ల నష్టపోయిన చేనేత కార్మికులను గుర్తించి ఆదుకోవాలని, ఆ చేనేత కుటుంబాలకు నష్ట పరిహారం అందిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర


రామారావు(ఫైల్)

మండల కేంద్రం పెనుమంట్ర గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి మంచిరాజు సీతా రామారావు(57) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఇందువల్లి గ్రామానికి చెందిన ఆయన 30 సంవత్సరాల నుండి పంచాయతీ రాజ్ సర్వీసులో ఉన్నారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మండలానికి పూర్తి స్థాయి ఇఒపిఆర్‌డి పోస్ట్ ఖాళీగా ఉన్న కాలంలో ఆయన కొన్ని నెలలు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన భౌతిక ఖాయం వద్ద స్థానిక పంచాయతీ సర్పంచి బొక్కా ప్రియాంక, ప్రసన్న కుమార్, ఆచంట, పెనుమంట్ర ఎంపిడిఒలు కృష్ణమోహన్, రామ్ ప్రసాద్, స్థానిక మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పలువురు నివాళులు తెలిపారు.

## ఆటో డ్రైవర్ నరేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్వయం కృషి ఆటో యూనియన్(భీమవరం కొత్తబస్ స్టాండ్) సభ్యుడు వెలుగట్ల నరేష్ ఇటీవల కాలంలో అనారోగ్యం వల్ల మరణించారు. స్వయం కృషి ఆటో యూనియన్ స్పందించి ఆటో డ్రైవర్ సోదరుల ఆ కుటుంబానికి చేయూతగా జిల్లా యూనియన్, భీమవరం ఆటో యూనియన్ అధ్యక్షులు ఇంటి సత్యనారాయణ చేతుల మీదుగా రూ.22 వేల నగదును ఆదివారం నరేష్ భార్యకు అందించడం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆరేపల్లి బాలాజీ సుదాకర్, రెల్లి రాము, జామి లింగాలు, యర్రంశెట్టి ఏసు ప్రసాద్ పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

భీమవరం టౌన్ : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పులపర్తి ప్రశాంత్ పుట్టినరోజు సందర్భంగా తాడేరు రోడ్డులోని భీమవరం వృద్ధుల ఆశ్రమంకు ప్రశాంత్ టీమ్ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు సతీమణి సత్యవాణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమాజ సేవ చేయడం ప్రతిఒక్కరి నైతిక బాధ్యత అని, ఇబువంటి వృద్ధుల ఆశ్రమంకు నిత్యావసర సరుకులను, బియ్యం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఇండస్ట్రియల్‌లోని బాలికల భోజనాలు, నిత్యావసర సరుకులను అందించారు.

## యథావిధిగా పిజిఆర్ఎస్

నరసాపురం : నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 3వ తేదీన సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. సబ్ డివిజన్లోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నుంచి అందించాలని కోరారు.

## తుపాను రక్షణ చర్యల్లో ప్రభుత్వం విఫలం : వైసిపి

పెనుమంట్ర : తుపాను ప్రభావం గురించి అధికారులు ముందే హెచ్చరించినా దానికి తగినట్లు రక్షణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కూటమి ప్రభుత్వం ప్రచారం ఎక్కువ చేస్తూ, ప్రజల్ని ఆదుకోవడం లేదని వైసిపి రాష్ట్ర మహిళా నేత, పెనుమంట్ర జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి తీవ్రంగా విమర్శించారు. మార్టేరులో ఆదివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ ప్రకృతి విపత్తును కూడా కూటమి నాయకులు ఫొటోలకు ఫోజులిచ్చి ప్రచారానికి వాడుకున్నారని, సుమారు ఐదు వేల కోట్లు నష్టం వాటిల్లిందని, కేంద్రానికి నివేదికలు పంపామని ప్రకటించి చేతులు దులుపుకున్నారని, ప్రజలకు తక్షణ సాయం మాత్రం అందించలేదని అన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## 'వికలాంగులకు చేయూతనివ్వాలి'

తాడేపల్లిగూడెం : సమాజంలో వికలాంగులను దాతృత్వానికి, సానుభూతికి పరిమితం చేయడం వారి హక్కులకు, అవకాశాలకు దూరం చేయడమేనని వికలాంగ మహా సంఘటన జాతీయ అధ్యక్షుడు, భారత ప్రభుత్వ జాతీయ యువ అవార్డు గ్రహీత, వికలాంగుల హక్కుల చట్టం 2016 నిబంధనల జిల్లా కమిటీ సభ్యుడు సుందరి రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం కెఎన్ రోడ్‌లో ఆదివారం సాయంత్రం స్థానిక వికలాంగ నాయకులు పులిమి లక్ష్మణరావు అధ్యక్షతన ఎంపిపి రామచంద్ర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లాలో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వికలాంగ నాయకులు, మహా సంఘటన జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్ రెడ్డి, సంఘం నాయకులు కొత్త వీర్రాజు, అంజిబాబు ప్రసంగించారు.

## వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా గురు ప్రసాద్

పెనుమంట్ర : వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ బహుజన వర్గాల నేత చింతపల్లి గురు ప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు నియామక ఉత్తర్వులు అందినట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రోత్సాహంతో చింతపల్లి గురుప్రసాద్‌కి ఈ ఉన్నత పదవి దక్కిన సందర్భంగా స్థానిక వైసిపి నాయకులు జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, వేణుబాబు, సర్పంచి తాడిపర్తి ప్రియాంక ప్రసన్న కుమార్, ఉప సర్పంచి భూపతిరాజు, వెంకట శ్రీనివాస రాజు హర్షం తెలిపారు.

## జోగి రమేష్ అక్రమ అరెస్ట్‌కు ఖండన

పాలకొల్లు : రాష్ట్రంలో అక్రమ కేసులు రాజ్యమేలుతున్నాయని, మాజీ మంత్రి జోగి రమేష్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం జరిగిందని పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బిసి ఓట్లతోనే గద్దెనెక్కిందని, అదే బిసిలను అక్రమ కేసులతో వేధిస్తుందని, చంద్రబాబు పతనం ఈ బిసిలతోనే ప్రారంభమైందని హెచ్చరించారు. బిసి నాయకుడు జోగి రమేష్‌ను అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, నారావారి మద్యం ప్రతి గ్రామంలో ఏరులై పారుతుందని, ఇది మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బిసిలంతా కూడా ఏకతాటిపైకి వచ్చి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు.

## ఆలయ హుండీ చోరీ

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం సౌత్ సెంటర్ ప్రాంతంలో ఉన్న వినాయకుడి ఆలయంలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీ తీసుకు వెళ్లి దానిలో నగదు అపహరించుకుపోయారు. హుండీని ఆలయ సమీపంలో ముళ్ల పొదల్లో దుండగులు పడేశారని స్థానికులు తెలుపుతున్నారు. దీనిపై ఫిర్యాదు అందవలసి ఉందని పోలీసులు తెలిపారు.0



# పేదింటి బిడ్డలకు డిఎస్‌సి కొలువులు

### పలు శాఖల్లో పనిచేస్తూనే.. డిఎస్‌సి సాధన

### పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రజాశక్తి - నరసాపురం

వారంతా నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు. ఆర్థిక స్థితి అంతంత మాత్రమే. ఇప్పటికే పలు శాఖలలో ఉద్యోగాలు చేస్తూనే.. మరో వైపు అహర్నిశలూ కష్టపడి, రాత్రీ పగలూ పుస్తకాలకే అంకితమై తమ కలలను సాకారం చేసుకున్నారు. డిఎస్‌సిలో పట్టువీడకుండా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని విజయం సాధించారు. వారికి ఇష్టమైన ప్రభుత్వ కొలువు సాధించి తల్లిదండ్రుల రుణం తీర్చుకున్నారు. ప్రజాశక్తి పలకరించగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పేదింటి బిడ్డలు పలు విషయాలు తెలిపారు.

### ఒకేసారి భార్యభర్తలకు ఉద్యోగాలు


రంగిశెట్టి రాజేష్ బాబు, హేమ లక్ష్మి దుర్గ

మండలంలోని దర్భరేవు గ్రామానికి చెందిన రంగిశెట్టి రాజేష్ బాబు, మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన సత్తినేని హేమ లక్ష్మి దుర్గలు భార్యభర్తలు. ఇటీవల విడుదలైన డిఎస్‌సి ఫలితాల్లో భార్యాభర్తలు ఇద్దరూ ఒకేసారి ఉద్యోగాలు సాధించారు. రంగిశెట్టి రాజేష్ బాబు 2016 నోటిఫికేషన్‌లో జైలు వార్డర్‌గా ఉద్యోగం సాధించి విశాఖపట్నం సెంట్రల్ జైలులో పనిచేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు బదిలీ అయ్యారు. ఖాళీ సమయాన్ని వదలకుండా పట్టుదలతో కష్టపడి చదివి ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల విడుదలైన డిఎస్‌సి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్(64వ ర్యాంక్), స్కూల్ అసిస్టెంట్ సోషల్(17వ ర్యాంక్), ఎస్‌జిటి(93వ ర్యాంక్) సాధించాడు. ప్రస్తుతం నరసాపురం పట్టణంలోని టైలర్ పేట మున్సిపల్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నారు. భార్య హేమ లక్ష్మీదుర్గ తొలి ప్రయత్నంలోనే ఎస్‌జిటిగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం రుస్తుంబాద మున్సిపల్ పాఠశాలలో చేరారు.

### లాఠీ వదిలి బెత్తం పట్టి..



మండలంలోని వేములదీవి ఈస్ట్ గ్రామం ఘంటసాల వారి మెరకకు చెందిన దివి వెంటేశ్వరరావు కుమారుడు సత్యనారాయణ మెగా డిఎస్‌సిలో ఎస్‌జిటిగా ఉద్యోగం సాధించాడు. నరసాపురం పట్టణంలోని 9వ వార్డులో మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయుడుగా చేరాడు. సత్యనారాయణ 2016 కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఎనిమిది సంవత్సరాల నుండి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రిపేరై ఉద్యోగం సాధించాడు. స్కూల్ దశ నుండే టీచర్ ఉద్యోగం సాధించాలనే ఉద్దేశ్యంతో పట్టుదలతో కష్టపడి చదివానని తెలిపారు. పోలీస్ ఐతే శాంతి భద్రతలు మాత్రమే కాపాడుతానని, టీచర్ అయితే ఎందరో పిల్లలకు మంచి భవిష్యత్తుకు పునాది అందించే అవకాశం ఉంటుందన్నారు.

### పంచాయతీ సెక్రటరీ నుంచి టీచర్‌గా



నరసాపురం ప ట్టణం రుస్తుంబాద్‌కు చెందిన దూడే వెంకట శేషు బాబు కుమారుడు శివ ప్రసాద్ ఈ ఏడాది నిర్వహించిన మెగా డిఎస్‌సిలో వ్యాయమ ఉపాధ్యాయుడుగా ఉద్యోగం సాధించారు. 2019లో పంచాయతీ సెక్రటరీగా ఉద్యోగం సాధించి లక్ష్మణేశ్వరం సెక్రటరీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల కుక్కునూరు బదిలీ అయ్యారు. పంచాయతీ సెక్రటరీగా ఉద్యోగం చేస్తూనే ఎటువంటి కోచింగ్ లేకుండానే పరీక్షలకు సిద్ధమై ఉద్యోగం సాధించాడు. మండలంలోని కాపులకొడప జెడ్‌పి హై స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ పీడీగా బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, క్రీడా కారులుగా తీర్చిదిద్దుతానని ఆయన తెలిపారు.

### చదివిన స్కూల్‌లోనే.. ఉపాధ్యాయుడిగా



మండలంలోని మోడీ గ్రామానికి చెందిన గుబ్బల బాలరాజు కుమారుడు లక్ష్మీ నరసింహ స్వామి డిఎస్‌సిలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా ఉద్యోగం సాధించాడు. తొలుత ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. క్రీడలంటే ఇష్టంతో పోలీస్ ఉద్యోగం కాదనుకుని వ్యాయామ ఉపాధ్యాయుడుగా చేరారు. తాను చదువుకున్న ఎల్‌బి చర్ల జెడ్‌పి హై స్కూల్‌లో చేరారు. గ్రామీణ విద్యార్థులని క్రీడల్లో ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తానన్నారు. విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతానన్నారు.

## రైతుల ప్రయోజనాలను కాపాడాలి

### కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్ : పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, రాజకీయాలకతీతంగా రైతుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేయాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మండలంలోని కొమరాడ-గోర్లమూడి విశాల సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా రాట్నాల సత్యనారాయణ(భీమవరం రూరల్ బిజెపి మండల అధ్యక్షులు), డైరెక్టర్లుగా మల్లుల పరమేశ్వరరావు, వర్రె గణేష్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ పదవి కేవలం బాధ్యతగా మాత్రమే చూడకుండా తమ ప్రాంత రైతుల, గ్రామాల అభివృద్ధికి సేవ చేసే గొప్ప అవకాశంగా భావించాలన్నారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సకాలంలో రుణాలు మంజూరు చేయాలని, తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలందించాలి

### మంత్రి నిమ్మల రామానాయుడు

నరసాపురం : సమర్థవంతమైన పాలకవర్గం ఉన్నప్పుడే సొసైటీ ఆర్థిక పరిపుష్టి సాధించి రైతులకు మెరుగైన సేవలు అందించగలమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని సీతారాంపురం సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత వైసిపి హయంలో సొసైటీలు నిర్వీర్యమయ్యాయన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి కూడా సకాలంలో సొమ్ము చెల్లించలేకపోయారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సొసైటీలు పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, ప్రభుత్వ మైనారిటీ సలహాదారులు ఎంఎ షరీఫ్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న రైతులకు భరోసాగా నిలవాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, సబ్సిడీ విత్తనాలు అందించి రైతులకు మేలు చేసేలా పనిచేయాలన్నారు. మాజీ ఎంఎల్‌ఎలు బండారు మాధవ నాయుడు, కొత్తపల్లి జానకీరామ్, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడారు. అనంతరం సొసైటీ ఛైర్మన్‌గా తాతాజీతో పాటు సభ్యులుగా దొంగ శ్రీరామచంద్రుడు, యర్రంశెట్టి మావులయ్య చేత సొసైటీ కార్యదర్శి గుబ్బల శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఆర్‌డిఒ దాసిరాజు, నెక్కంటి సుబ్బారావు, మైలా వసంతరావు, ఆకన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సమన్వయంతోనే తుపాను ప్రభావాన్ని ఎదుర్కొన్నాం

### అధికారులను సత్కరించిన ఎంఎల్‌ఎ

### బాధితులకు నిత్యావసరాల పంపిణీ

తణుకు : అధికారులు, కూటమి నాయకుల సమన్వయంతో కొంత తుపాను ప్రభావాన్ని తణుకు నియోజవర్గంలో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం తణుకు పట్టణంలోని తుపాను ప్రభావానికి గురైన బాధితులకు 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసరాలు, కూరగాయలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తుపాను హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సమన్వయంతో అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందిని సత్కరించి, అభినందించారు. నియోజకవర్గంలో తుపాను ప్రభావంతో ప్రాథమిక అంచనా ప్రకారం 4 వేల ఎకరాల్లో పంట నష్టం ఏర్పడిందని అధికారులు నివేదికలు ఇచ్చారని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ఈ సందర్భంగా సూచించారు.

## పంట నష్టంపై సర్వే



రైతులనుండి వివరాలు తెలుసుకుంటున్న సిబ్బంది

నరసాపురం : మండలంలోని కొప్పరు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యాన ఆదివారం సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పొలాల బాట పట్టారు. కొప్పర్రు సొసైటీ ఛైర్మన్ అందే నరేన్ ఆదేశాల మేరకు జరిగిన నష్టాన్ని స్వయంగా చూసి సర్వే చేయాలని ఆదేశించడంతో సిబ్బంది కొప్పర్రు సొసైటీ పరిధిలోని వరి పంట పొలాల్లోకి వెళ్లి జరిగిన నష్టాన్ని రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఎంత నష్టం జరిగింది, వరి పంటలు ఏమేరకు నష్టపోయాయి అనే దానిపై స్వయంగా పరిశీలించి నివేదికను తయారుచేశారు. దీన్ని జిల్లా అధికారులకు పంపిస్తామని అధ్యక్షులు అందే నరేన్ విలేకరులకు తెలియజేశారు. ఎవరైనా రైతులు మిగిలిన పక్షంలో సహకార సంఘం వద్దకు వచ్చి సర్వే చేయించుకోవాలన్నారు. ఈ సర్వేలో సొసైటీ కార్యదర్శి దొడ్డా లక్ష్మణ రావు, సొసైటీ సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్నా : మంత్రి

యలమంచిలి : పాలకొల్లు నియోజకవర్గంలో మూడుసార్లు ఎంఎల్‌ఎగా గెలిపించిన తన కుటుంబ ప్రజల రుణం తీర్చుకునేలా అభివృద్ధి, సంక్షేమాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో రోజుకు 18 గంటల పాటు ఎటువంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా పని చేస్తున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని లక్ష్మీ పాలెం, గంగడ పాలెం గ్రామాల్లో తుపాను సాయంగా మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, ఐదు రకాల నిత్యావసర సరుకులను కూటమి నాయకులతో కలిసి ఆయన అందజేశారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావులకు నివాళులు


శ్రీనివాసరావు భౌతికకాయం వద్ద నివాళులుర్పిస్తున్న రాష్ట్ర నేతలు

ఆచంట : ఆచంట గ్రామానికి చెందిన సిపిఎం మాజీ టౌన్ కార్యదర్శి చేకూరి కాశీ విశ్వేశ్వరరావు(80) అంత్యక్రియలు ఆదివారం ఆచంటలో జరిగాయి. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.బలరాం, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ విచ్చేసి కాశీ విశ్వేశ్వర కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం చింతలతోటలో సిపిఎం సానుభూతిపరుడు దేవాబత్తుల శ్రీనివాసరావు(50) భౌతికాయాన్ని సందర్శించి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాసరావు భార్య జ్యోతి ఇతర దేశంలో ఉన్న కారణంగా సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేకూరి కాశీ విశ్వేశ్వరరావు, దేవాబత్తుల శ్రీనివాసరావు మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, మండల కార్యదర్శి పి.మోహన్, నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, మన్నే బ్రహ్మయ్య, తదితరులు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



## సిపిఎం సానుభూతిపరులు సత్యనారాయణ మృతి

పాలకొల్లు : సిపిఎం సానుభూతిపరులు కందిబోయిన సత్యనారాయణ(74) మండలంలోని అరటికట్లలో ఆదివారం మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో చురుకుగా పనిచేశారు. పెద్ద కుమారుడు ఇటీవల మృతి చెందారు. సత్యనారాయణ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. చాలాకాలం సిపిఎం పార్టీ సభ్యులుగా, గ్రామ కార్యదర్శిగా పనిచేసి ప్రజా సమస్యలపై పోరాడారు. ప్రజా సంఘాల్లో, రైతు సమస్యలపై పనిచేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్, యర్రా అజయ్ కుమార్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జత్తిగ నరసింహమూర్తి, కందిబోయిన రామకృష్ణ, లక్ష్మణరావు, మీరారావు సంతాపం తెలిపారు.

## ముగిసిన విజిలెన్స్ అవగాహన

తాడేపల్లిగూడెం : డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వారం రోజుల పాటు 'జాగ్రత్త మన ఉమ్మడి బాధ్యత' అనే అంశంపై విజిలెన్స్ అవగాహనా కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 27న 'సమగ్రత ప్రతిజ్ఞ'తో మొదలై, సమగ్రత వాక్‌థాన్ వంటి వివిధ కార్యక్రమాలతో నవంబర్ 2 వరకు వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ దర్శకత్వంలో వారం రోజుల పాటు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపు సమావేశానికి గౌరవ అతిథులుగా తాడేపల్లిగూడెం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుసులూరి శివ రామకృష్ణ, తాడేపల్లిగూడెం(రూరల్) సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, విద్యా సంస్థల్లో క్రమశిక్షణ, నిజాయితీ, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు విజిలెన్స్ అవగాహనా కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రస్తావించారు. విజిలెన్స్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా ఎలక్యూషన్, వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్, డీన్, విశ్వవిద్యాలయ అధికారులు, కళాశాల అసోసియేట్ డీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



## భూమి కౌలు హక్కునకు లైసెన్స్ మరియు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలంలో గల దేవాలయములకు సంబంధించిన ఈ క్రింది పట్టికలో ఉదహరించిన ఐటమ్స్ నకు లైసెన్స్ హక్కునకు గాను ఈ క్రింది తెలిపిన దేవాలయముల వద్ద సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో సదరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వారిచే జరుపబడును. కావున ఆశక్తి గల పాటదారులు పాటలో పాల్గొన వలసినదిగా కోరడమైనది. మిగిలిన పాట షరతులు ఆఫీసు పనిచేయు వేళలలో తెలుసుకోవలెను.

**శ్రీ మదనగోపాల స్వామి వారి దేవస్థానం, పేరుపాలెం గ్రామం, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.**

| వ. నెం. | రి.స.నెం | పరిమితి, వివరం | ధరావత్తు సొమ్ము | లైసెన్సు కాలపరిమితి | పాట జరుగుతేది ప్రదేశం |
|---|---|---|---|---|---|
| 1 | 39/2 | య.1.71 ట్లు మామిడితోట | 10,000 | ది.01-01-2026 నుండి 31-07-2026 | 15-11-2025వ తేది శనివారం మద్యాహ్నం 2.00 గం.లకు శ్రీ స్వామి వారి ఆలయం వద్ద |
| 2 | 90/4 | య.1.61 ట్లు సపోటా తోట | 1,000 | | |
| 3 | 151/1 | య.1.71 ట్లు సపోటా తోట | 1,000 | | |
| 4 | 91/12బి | య.0.20 ట్లు సపోటా తోట | 1,000 | | |
| 5 | 151/1, | సర్వి చెట్లు కొట్టుకొను పోవు హక్కునకు | 10,000 | -- | |
| | 39/2 | మారుజాతి చెట్లు కొట్టుకొను పోవు హక్కునకు | 10,000 | -- | |

**శ్రీ రాజగోపాలస్వామి వారి దేవస్థానం, కె.పి.పాలెం గ్రామం, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా.**

| వ. నెం. | రి.స.నెం | పరిమితి, వివరం | ధరావత్తు సొమ్ము | లైసెన్సు కాలపరిమితి | పాట జరుగుతేది ప్రదేశం |
|---|---|---|---|---|---|
| 1 | 110 | య.0.50ట్లలో 32 మామిడిచెట్లు, 24 కొబ్బరి చెట్లు | 10,000 | ది.01-01-2026 నుండి 31-12-2028 | 15-11-2025 వ తేది శనివారం ఉధయం 11.00 గం.లకు శ్రీ స్వామి వారి ఆలయం వద్ద |
| 2 | 142/6 | య.0.50ట్లలో 18 మామిడిచెట్లు, 30 కొబ్బరి చెట్లు | 5,000 | | |
| 3 | 27/4ఎ1 | య.0.13ట్లలో 1 మామిడిచెట్టు, కూరగాయలు సాగు చేసుకొనుటకు (తూర్పుతాళ్ళు గ్రామం) | 1,000 | | |

మొగల్తూరు, తేది. 02-11-2025. కార్యనిర్వహణాధికారి, సెల్ నెం.9618847576

## 225 మందికి వైద్య పరీక్షలు

వీరవాసరం: కొల్లా భాస్కరమ్మ, శ్రీవీరరాఘవులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 225 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కొల్లా శ్రీహరి కుటుంబ సభ్యులు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య పరీక్షల్లో 177 మందికి కంటి సమస్యలను గుర్తించారు. 105 మందికి కళ్లజోళ్లు, 72 మందికి కంటి ఆపరేషన్‌లు ట్రస్ట్ తరుపున చేయిస్తున్నట్లు తెలిపారు. కొల్లా రాము, మద్దాల గోవిందమ్మ, ఆసుపత్రి మేనేజర్ అల్లూరి లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.